భారీ మెజార్టీతో గెలిపించాలి

- వెంకట్రామిరెడ్డి కష్టపడే వ్యక్తి..
- రూ.100 కోట్లతో పేద విద్యార్థుల కోసం ట్రస్ట్ ఏర్పాటు
- హామీలన్నీ అమలు చేసేదాకా కాంగ్రెస్‌ను నిలదీయాలి
- డిపాజిట్లు రాని బీజేపీకి.. మళ్లీ అదే గతి పడుతుంది
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- మెదక్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం


మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

మెదక్, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థిగా వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని వైస్రాయ్ గార్డెన్స్‌లో మెదక్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ హేమలత, వైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, ఫారూక్ హుస్సేన్, మాణిక్యం, కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, బట్టి జగపతి, సోములు, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, జడ్పీటీసీలు, ఎంపీపీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ... వంద రోజుల కాంగ్రెస్ పాలన అందరికీ అర్థం అయ్యిందన్నారు. అధికారంలోకి వస్తే రూ.2 లక్షల రుణమాఫీ అని, రూ.500 బోనస్ ఇచ్చి వడ్లు కొంటామని హామీలు ఇచ్చి, మాట తప్పారని విమర్శించారు. మహాలక్ష్మీ పేరిట మహిళలకు రూ.2500 ఇస్తామని మోసం చేశారని గుర్తు చేశారు. అవ్వ, తాతలకు రూ.4వేల పింఛన్ ఇస్తామని, ఇప్పటికే ఒక్కొక్కరికీ రూ.8వేలు బాకీ పడ్డారన్నారు. రైతుబంధు రూ.15వేలకు పెంచుతా మని చెప్పి, ఇప్పటికీ రైతుబంధు ఇవ్వని కాంగ్రెస్‌కు ప్రజలు, రైతులు తగిన బుద్ధి చెప్పే రోజులు వచ్చాయని హెచ్చరించారు. కౌలు రైతులకు రైతుబంధు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. కల్యాణలక్ష్మి చెక్కు తోపాటు తులం బంగారం ఇస్తామని చెప్పి.. ఇవ్వలేని ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకు కాంగ్రెస్ పార్టీని నిలదీయాలన్నారు.

సత్తా చూపే వ్యక్తి వెంకట్రామిరెడ్డి...

రోజుకూ 18 గంటలు కష్టపడే వ్యక్తి.. గొప్ప మనసున్న వెంకట్రామిరెడ్డిని పార్లమెంట్‌కు పంపాలని మాజీ మంత్రి హరీశ్‌రావు కోరారు. పేద విద్యార్థుల కోసం రూ.100 కోట్లతో ట్రస్ట్ ఏర్పాటు చేయనున్నట్టు వెంకట్రామిరెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. విద్యావంతుడు, కలెక్టర్‌గా పనిచేశాడని, రాజ్యాంగం తెలిసిన వెంకట్రామిరెడ్డి తెలంగాణ కోసం గళం విప్పుతారని తెలిపారు. ఎంపీగా వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

బీజేపీకి.. మళ్లీ అదే గతి పడుతుంది

అసెంబ్లీ ఎన్నికల్లో రఘునందన్‌రావును 50 వేల పైగా ఓట్లతో చిత్తుగా ఓడించారని, డిపాజిట్లు రాని బీజేపీకి మళ్లీ అదే గతి పడుతుందని హరీశ్‌రావు అన్నారు. బీజేపీ గెలిస్తే తెలంగాణకు ప్రయోజనం ఉండదన్నారు.

కేసులు పెడితే భయపడేది లేదు..

కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు పెడితే భయపడే పార్టీ బీఆర్ఎస్ కాదని మెదక్‌మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తెలిపారు. మెదక్ ఎంపీగా వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఆయనకు జిల్లాపై అవగాహన ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండు ఒక్కటేనని విమర్శించారు. కేసీఆర్‌కు కానుకగా వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

ఎంపీగా గెలిపించండి.. సేవ చేస్తా..

మెదక్ ఎంపీగా నన్ను గెలిపించండి.. మీకు సేవ చేస్తానని మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో కలెక్టర్‌గా, డ్వామా పీడీగా పని చేసిన అనుభవం ఉందని, ఆ అనుభవంతోనే కేసీఆర్ ఎమ్మెల్సీగా తనకు అవకాశం ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు మెదక్ ఎంపీగా నన్ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీ ల్యాండ్స్ నిధులు వస్తే మెదక్ ఎంపీ పరిధిలోని నియోజకవర్గాలకు కేటాయిస్తానని చెప్పారు. ఏడు నియోజకవర్గాల్లో సొంత డబ్బులతో ఫంక్షన్ హాళ్లను నిర్మిస్తానని హామీనిచ్చారు.

సజావుగా 'పది' పరీక్షలు

నర్సాపూర్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 26 : జిల్లావ్యాప్తంగా మంగళవారం ఐదో రోజు పదో తరగతి భౌతిక శాస్త్రం పరీక్ష సజావుగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 68 పరీక్ష కేంద్రాల్లో 10,300 మంది విద్యార్థులకు 10,279 మంది హాజరు కాగా, 21 మంది గైర్హాజరయ్యారని డీఈవో రాధాకిషన్ తెలిపారు. ప్రైవేట్ విద్యార్థులు 38 మందికి 30 మంది హాజరైనట్లు చెప్పారు. జిల్లాలో 99.80 శాతం హాజరైనట్లు పేర్కొన్నారు. అల్లాదుర్గం, రేగోడ్, పెద్దశంకరంపేట, టేక్మాల్, పాపన్నపేట, తూప్రాన్ మండలాల్లోని 14 పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందం తనిఖీలు చేపట్టిందన్నారు.

అదనపు కలెక్టర్ తనిఖీ

నర్సాపూర్, మార్చి 26 : పదో తరగతి పరీక్షలు సజావుగా జరుగుతున్నాయని అదనపు కలెక్టర్ రమేశ్ అన్నారు. నర్సాపూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రమేశ్ మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించామన్నారు. విద్యార్థులు ఆందోళన చెందకుండా పరీక్షలు జాగ్రత్తగా రాయాలని సూచించారు. పరీక్ష రాయడానికి వచ్చేటప్పుడు, పరీక్ష అనంతరం ఇంటికి వెళ్లేటప్పుడు జాగ్రత్తగా రావాలన్నారు. అదనపు కలెక్టర్ వెంట అధికారులు, సిబ్బం ది ఉన్నారు.

బీడీ కార్మికులకు కరువు భత్యం ఇవ్వాలి

బీడీ కార్మికులతో మాట్లాడుతున్న నూతన బీడీ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి శివంది సత్యం

రామాయంపేట, మార్చి 26 : కేంద్ర ప్రభుత్వం బీడీ కార్మికులకు కరువు భత్యం కేంద్రం ఇవ్వాలని నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంది సత్యం కోరారు. మంగళవారం రామాయంపేటలోని బీడీ కార్ఖానాలో బీడీ కార్మికులతో సమావేశమయ్యారు. వచ్చేనెల నుంచి బీడీ కార్మికులకు కరువు భత్యాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలన్నారు. కంపెనీల్లో పని చేసే నెలసరి ఉద్యోగులతో పాటు ప్యాకర్స్‌కు కూడా వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు నెలకు 25 రోజుల పని కల్పించాలన్నారు. తునికి ఆకు తూకం వేయని పరిశ్రమలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సీపీఐ నాయకుడు మృతి

దుర్గయ్య (ఫైల్)

నర్సాపూర్, మార్చి 26 : సీపీఐ సీనియర్ నాయకుడు జాజాల దుర్గయ్య గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందారు. నర్సాపూర్ మండలం నత్నాయిపల్లి గ్రామానికి చెందిన దుర్గయ్య కొన్నేండ్ల పాటు సీపీఐలో ఉంటూ పేదప్రజల కోసం సేవలందించారు. దుర్గయ్య మృతిపై రాజకీయ నాయకులు, అభిమానులు సంతాపం ప్రకటించి, నివాళులర్పించారు.

బెల్ట్‌షాపుపై దాడి..

చిట్కుల్‌లో సోదాలు చేస్తున్న సిబ్బంది

చిలిపిచెడ్, మార్చి 26 : చిలిపిచెడ్ మండ లం చిట్కుల్ గ్రామంలో బెల్ట్ షాపుపై పోలీసులు మంగళవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. చిట్కుల్‌లో పోతరపల్లి అంజయ్య అనుమతి లేకుండా నిల్వ ఉంచిన రూ.2970 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై షేక్ మహబూబ్ తెలిపారు. అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఏఎస్సై సంధ్యారాణి, పోలీసు సిబ్బంది దేవీసింగ్ ఉన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..

భర్త ఆత్మహత్య

రామాయంపేట, మార్చి 26 : రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామ రైల్వేస్టేషన్ శివారులో రైలు కిందపడి మెదక్ మండలం నవాబుపేటకు చెందిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. కామారెడ్డి రైల్వే పోలీసులు, ఎస్సై తారు నాయక్ తెలిపిన వివరాలు.. మెదక్ మండలం నవాబుపేటకు చెందిన మొకిరె మహేశ్(31)కు హవేళీఘనపూర్ మండలం నాగపూర్‌కు చెందిన జ్ఞానేశ్వరితో వివాహం జరిగింది. కాగా, కుటుంబ కలహాలతో ఏడాది కాలంగా భార్య జ్ఞానేశ్వరి పుట్టింటిలో ఉంటున్నది. పలుమార్లు పంచాయతీ పెట్టినా కాపురానికి రాలేదు. దీంతో మనస్తాపం చెందిన మహేశ్ మంగళవారం రాత్రి అక్కన్నపేట రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య కాపురానికి రాకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబీకులు తెలిపారని కామారెడ్డి రైల్వే అధికారి తారునాయక్ వివరించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నట్లు వివరించారు.

పక్కాగా ధాన్యం కొనుగోలు చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్రప్రధాన కార్యదర్శి శాంతికుమారి

మెదక్, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : యాసంగి 2023-24 ధాన్యాన్ని ప్రణాళిక బద్ధంగా మద్దతు ధర పై కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హైదరాబాద్‌లోని అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి ధాన్యం కొనుగోలు, తాగునీటి సరఫరా ప్రణాళికపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ.. యాసంగి పంట కోతలకు వస్తున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరిస్తూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలన్నారు. అధికారులు మాత్రమే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, ప్రజాప్రతినిధులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లకు రాష్ట్రవ్యాప్తంగా 7149 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాల సూచించారు. ప్యాడీ క్లీనర్లు, తేమ యంత్రాలు, వెయింగ్ యంత్రాలు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేసేందుకు వాహనాలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. ప్రతి గింజకూ మద్దతు ధర ఇస్తామని తెలిపారు. భారత ఆహార సంస్థ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం కొనుగోలు కేంద్రాలకు ట్యాగింగ్ చేసి, విక్రయాలను పూర్తి చేయాలన్నారు. వానాకాలం (2023-24) సంబంధించి సీఎంఆర్ రా రైస్ డెలివరీ వేగవంతం చేయాలని, రైస్ డెలివరీ చేసే విధంగా రైస్ మిల్లుల పనితీరును పర్యవేక్షించాలని, దీనిపై కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. మెదక్ జిల్లాలో 410 కేంద్రాలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ధాన్యం కొనుగోలు చేస్తామని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. కాన్ఫరెన్స్‌లో డీఏవో గోవిందు, డీఎస్‌వో బ్రహ్మరావు, డీఎం హరికృష్ణ, అదనపు డీఆర్డీవో సరస్వతి, డీసీవో కరుణ పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

తాగునీటి ఇబ్బందులు రావొద్దు

తాగునీటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉంటూ తాగునీటి సరఫరాలో వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. గ్రామం, మున్సిపల్ వార్డు స్థాయిలో తాగునీటి సరఫరాపై సమ్మర్ యాక్షన్‌ప్లాన్, ప్రత్యామ్నాయ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎక్కడా ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రమేశ్, జిల్లా పంచాయతీ అధికారి యాద య్య, మిషన్ భగీరథ ఈఈ సంపత్ కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూపు పరీక్షలకు ఉచిత శిక్షణ

ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 26 : ఎస్సీ నిరుద్యోగ విద్యార్థులకు గ్రూప్ 1, 2, 3 పోటీ పరీక్షల కోసం మూడు నెలల పాటు ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అధికారిణి విజయలక్ష్మి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ ఇవ్వడానికి 30 బ్యాక్‌లాగ్ అడ్మిషన్లు భర్తీ చేయనున్నటలు, అసక్తి ఉన్న అభ్యర్థులు జిల్లా కేంద్రం మెదక్‌లోని ప్రగతి విద్యానికేతన్, మెదక్ స్టడీ సెంటర్‌లో ఈ నెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ఎస్సీ విద్యార్థినీవిద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9849 52 6767 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పార్టీలకతీతంగా అభివృద్ధికి సహకరించాలి

రామాయంపేట ఎంపీపీ నార్సింపేట భిక్షపతి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భిక్షపతి, ఎంపీడీవో షాజిల్ ఉద్దీన్

రామాయంపేట, మార్చి 26 : పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ నార్సింపేట భిక్షపతి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఎంపీటీసీ మల్లన్నగారి నాగులు మాట్లాడుతూ.. లక్ష్మాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్య సిబ్బందిని నియమించాలన్నారు. అక్కన్నపేటలో కల్తీకల్లు విక్రయాలను ఎక్సైజ్ అధికారులు అడ్డుకోవాలని కోరారు. కల్తీ కల్లుతో పాటు మద్యం విక్రయాలను అడ్డుకుంటామని ఎక్సైజ్ ఎస్సై విజయ్‌సిద్దార్థ తెలిపారు. అటవీ ప్రాంతాల్లో మొక్కల పెంపకానికి ప్రత్యేక చర్యలను చేపడుతున్నామని ఫారెస్ట్ బీట్ అధికారి రాములు అన్నారు. మహిళలు ఆధార్‌కార్డు చూపించి, ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించాలని ఆర్టీసీ కంట్రోలర్ సూచించారు. అక్కన్నపేట కార్యదర్శి సరిత మాట్లాడుతూ.. కల్తీకల్లుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీపీ భిక్షపతి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకాధికారులు, కార్యదర్శి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఆయా గ్రామాల ఎంపీటీసీలు, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

- ఎకరానికి రూ.25 వేలు ఇవ్వాలి
- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, మార్చి 26 : ఎండిపోయిన వరి పంటకు ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలని ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. నర్సాపూర్ మండలంలోని ఎల్లారెడ్డిగూడతండాలో మంగళవారం ఎండిపోయిన వరి పంటలను ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పరిశీలించి, రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పాడని విమర్శించారు. రైతుబంధు డబ్బులను బ్యాంకు వాళ్లు తీసుకోకుండా చర్యలు చేపట్టాలన్నారు. కాంగ్రెస్ వస్తే కాలం పోతదని... కేసీఆర్ వస్తే కాలం ఐతదని ఉద్ఘాటించారు. కేసీఆర్ హయాంలో ఎక్కడా పంటలు ఎండిపోలేదని.. కానీ, నేడు ఎక్కడా చూసిన ఎండిన పంటలే కనిపిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇవ్వడంతో మోటర్లు కాలేదని.. కాంగ్రెస్ హయాంలో నెలకు 3 సార్లు కాలుతున్నాయని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటేసి విజయం అందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లలిత, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు సత్యం గౌడ్, జీవన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎండిపోయిన వరి పంటలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నీటి శుద్ధి కేంద్రం ప్రారంభం

చేగుంట మండలం అనంతసాగర్‌లో సప్తగిరి పరిశ్రమ సహకారంతో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రాన్ని మంగళవారం పరిశ్రమ జనరల్ మేనేజర్ రాజు, మాజీ సర్పంచ్ మాజీ సర్పంచ్ లక్ష్మీసిద్ధిరాములు, స్థానిక నాయకుడు నర్సింహులు ప్రారంభించారు.

- చేగుంట, మార్చి 26

మక్కరాజిపేటలో ఇఫ్తార్ విందు

మక్కరాజిపేటలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, మార్చి 26 : చేగుంట మండలం మక్కరాజిపేటలో మైనార్టీలు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. విందులో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఇఫ్తార్ విందు అనంతరం చిన్నశివునూర్‌లోని టెలీకాం బోర్డు సభ్యుడు కమ్మరి వెంకటేశం- సరస్వతి దంపతుల ఇంటికి వెళ్లి, కుమారుడు కృష్ణమాచారి - సోనిక (భాగ్యలక్ష్మి) దంపతులను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆశీర్వదించారు. ఇఫ్తార్ విందులో ఎస్సీ, ఎస్టీ చైర్మన్ బక్కి వెంకటయ్య, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ నయ్యర్, రంగయ్యగారి రాజిరెడ్డి, కోమండ్ల నారాయణరెడ్డి, కుమ్మరి శ్రీనివాస్, బండి విశ్వేశ్వర్, మమ్మద్‌ఆలీ, బబ్బు పటేల్, నవాబ్, ముస్తాక్, బక్కి రమేశ్, కొఠారి అశోక్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి

రామాయంపేట, మార్చి 26 : సైబర్ నేరాలకు గురికాకుండా ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని, అపరిచితులు చెబుతున్న మాటలు, హామీలను నమ్మొద్దని సీఐ వెంకటేశ్ సూచించారు. మంగళవారం రామాయంపేట పోలీస్‌స్టేషన్‌లో సీఐ మాట్లాడారు. గుర్తు తెలియని ఫోన్ నెంబర్ల ద్వారా వచ్చే లింక్‌లను క్లిక్ చెయొద్దన్నారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత వివరాలను పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. మహిళలు విలువైన ఆభరణాలను ఇంట్లోనే ఉంచి ప్రయాణాలు చేయాలని సూచించారు. అవగాహనతోనే అరికట్టవచ్చన్నారు.

హైవేలో అదుపుతప్పిన కారు

రామాయంపేట, మార్చి 26 : రామాయంపేట జాతీయ రహదారిపై ఓ కారు అదుపుతప్పి పల్టీలు కొట్టిన ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన ఒకే కుటుంబ సభ్యులు కారులో సోమవారం ధర్మాబాద్‌కు వెళ్లి, తిరుగు ప్రయాణమయ్యారు. రామాయంపేట జాతీయ రహదారి వద్ద కారు డివైడర్‌కు ఢీకొని పల్టీలు కొడుతూ రోడ్డుపైనే ఆగిపోయింది. ప్రమాద సమయంలో కారుకు ఉన్న బెలూన్లు తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రమాదాన్ని గమనించి, కేసీఆర్ కాలనీవాసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రామాయంపేట పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కోమటిపల్లి తండాలో ప్రతిష్ఠాపనోత్సవాలు

రామాయంపేట, మార్చి 26 : మున్సిపాలిటీలోని కోమటిపల్లి తండాలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం ఆలయంలో వేద బ్రాహ్మణులు యంత్ర ప్రతిష్ఠ, హోమాలు నిర్వహించారు. హోమం చేస్తుండగా ఆలయ ధ్వజస్తంభంపై కొండెంగ చేరుకున్నది. గంటపాటు ఆలయంపై ఉన్నది. హనుమంతుడే వచ్చాడని గిరిజనులు సంబురపడ్డారు. పూజా కార్యక్రమాలకు గిరిజన భక్తులు భారీగా తరలి వచ్చారు.

వాహనాల తనిఖీ

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఎస్‌టీ సభ్యులు

చిన్నశంకరంపేట, మార్చి 26 : మండలకేంద్రం చిన్నశంకరంపేట శివారులో పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మంగళవారం ఎస్ఎస్‌టీ బృందం సభ్యులు వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.50 వేలకు పైగా నగదును ఆధారాలు లేకుంటే తీసుకెళ్తే సీజ్ చేస్తామని ఎస్ఎస్‌టీ సభ్యుడు వేణుమాదవ్ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని కోరారు.

కుక్కల దాడిలో 28 గొర్రెలు మృతి

శివ్వంపేట, మార్చి 26 : ఊరకుక్కల దాడిలో దాదాపు 28 గొర్రెలు మృత్యువాత పడ్డ ఘటన శివ్వంపేట మండలం గోమారం గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు.. గోమారానికి చెందిన బండ యాదయ్య గొర్రెల పెంపకందారుడు. ఎప్పటిలాగే సోమవారం రాత్రి గొర్రెలను షెడ్డులో ఉంచాడు. అయితే, రాత్రి సమయంలో ఊరకుక్కల మంద షెడ్డులోకి వెళ్లి, గొర్రెల మందపై విరుచుకుపడ్డాయి. దాదాపు 28 గొర్రెలు మృతి చెందాయి. ఉదయం షెడ్డుకు వద్దకు వచ్చిన యాదయ్య మృతి చెందిన గొర్రెలను చూసి, కన్నీటి పర్యంతమయ్యాడు. దాదాపు రూ. 2.50లక్షల విలువైన గొర్రెలు చనిపోయాయని, ప్రభుత్వం ఆదుకోవాలని యాదయ్యతోపాటు గ్రామస్తులు కోరారు. మండల పశువైద్యాశాల వైద్యాధికారి వివరణ ఇస్తూ.. గొర్రెల మృతిపై అధికారులు వివరాలు సేకరించారని, ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు.

మృతిచెందిన గొర్రెలు